రోడ్ సేఫ్టీపై అవగాహన



గచ్చిబౌలి: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం పోలీసులు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంపై స్కూల్ బస్సులో విద్యార్థులకు పోలీసులు వివరించారు. కొండాపూర్‌లో ఆర్టీఓ కార్యాలయం వద్ద సాధన ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. వాటిని చదివి రోడ్డుపైకి వచ్చేవారందరికీ అవగాహన కల్పించాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి 16,57,500 రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నియోజకవర్గ ప్రజల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోచోటు చేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం నిర్వహించిన డ్రైవ్ లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా పదిమందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, మరో ఇద్దరి కి రూ. 1500 జరిమానా, మరో ఇద్దరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

మరమ్మతుల మాయ.. రోడ్లపై గుంతలు షరా మామూలే..

మియాపూర్ : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో అవి మూణ్నాళ్ల ముచ్చటగా తయారవుతున్నాయి. రోడ్ల మరమ్మతులకు ప్రతియేటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. రోడ్ల నిర్మాణం, మరమ్మతుల సమయంలో నాణ్యత, నిబంధనలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్లు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గుంతలు పడ్డ మియాపూర్ టాకీటౌన్- మియాపూర్ గ్రామం వెళ్లే రోడ్డు

- మియాపూర్ డివిజన్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన, అంతర్గత రోడ్లు గుంతలు పడ్డాయి. ఆ గుంతలను పూడ్చడానికి లక్షలాది రూపాయలు కేటాయించారు. తాజాగా గుంతల మరమ్మతులు ప్రారంభించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత పాటించడం లేదనే విమర్శలు వెలువడుతున్నాయి.
- గుంతలను సరిగ్గా పూడ్చడం లేదని, దీంతో మరమ్మతులు చేసిన ప్రాంతంలో రోడ్డు ఎత్తు పల్లాలుగా మారుతుందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు.
- తారు, కంకర మిశ్రమం వేసే ముందు ఆ గుంతల్లో నీరు, తడి లేకుండా చేసి మరమ్మతులు చేస్తే రోడ్డు దృఢంగా ఉంటుందని, మినీ రోలర్‌తో చదును చేస్తే రోడ్డు త్వరగా పాడవదని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. నిబంధనలు పాటించకపోవడంతో మూడు రోజులకే కంకర తేలిపోతోంది.





మియాపూర్ ప్రధాన రహదారిలో మరమ్మతులు చేసిన దృశ్యం

10 కిలోల గంజాయి స్వాధీనం

గచ్చిబౌలి: గంజాయి అమ్మేందుకు యత్నిస్తున్న వారి వద్ద నుంచి 10 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 13న మధ్యాహ్నం రాయదుర్గంలోని మల్కంచెరువు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా కోర్ధా జిల్లాకు చెందిన రైతు మహరాన దీనబంధు(40) ఒడిశా కటక్ చెందిన బీటెక్ విద్యార్థి అభిషేక్ మహపాత్ర(23)తో కలిసి గంజాయి విక్రయిచేందుకు సిద్ధంగా ఉన్నారు. వారి వద్ద బ్యాగ్‌లో 10 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా దస్పల్లా గ్రామానికి చెందిన జోగేష్ అనే వ్యక్తి నుంచి గంజాయి తీసుకొని రెండేళ్లుగా విక్రయిస్తున్నట్లు దీనబంధు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై డ్రైనేజీ.. దుర్వాసన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ సురభి కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. దీంతో కాలనీవాసులు దుర్వాసన భరించలేక ఇబ్బందిపడుతున్నారు. రాకపోకలు సాగించేందుకు అవస్థ పడుతున్నారు. సుమారు 500 మీటర్ల వరకు డ్రైనేజీ పారుతోంది. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



రిజర్వేషన్లు అమలు చేయాలి

రాయదుర్గం: దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ లా యూనివర్సిటీ (ఎన్ఎల్‌యూ)లలో ఓబీసీల రిజర్వేషన్లు అమలు చేయాలని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆలిండియా కోటా సీట్లలో రిజర్వేషన్ విధానం తక్షణం అమలు చేసేలా చూడాలంటూ న్యాయవాది పంకజ్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్‌కుమార్ మిశ్రాకు వినతిపత్రాన్ని అందజేశారు. రాజ్యాంగబద్ధ హక్కుల అమలునకు పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.

మెడికవర్‌లో ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం

మాదాపూర్: కేన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే నయం చేయవచ్చని మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్ హెడ్ సువన్కర్ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15 నుంచి 31వ తేదీ వరకు ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించబడుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు హైటెక్‌సిటీలోని మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో వైద్యులు సేవలు అందించనున్నట్టు తెలిపారు. శిబిరంలో రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్, సర్వైకల్ కేన్సర్ పరీక్ష, పురుషులకు ప్రొస్టేట్ కేన్సర్ పరీక్ష, కేన్సర్ స్పెషలిస్ట్ కన్సల్టేషన్‌లను ఉచితంగా అందించనున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 040 6833 4455లలో సంప్రదించవచ్చు.

రక్తదాన శిబిరం

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కుమారుడు దివంగత గూడెం విష్ణువర్ధన్ రెడ్డి జయంతిని పటాన్‌చెరులో జీఎంఆర్ యువసేన, జీవీఆర్ ఫ్రెండ్స్ గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జీవీఆర్ ఫ్రెండ్స్ రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఫ్రీడమ్ పార్క్ ఎదురుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలలో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్‌రెడ్డి, గుమ్మడిదల మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, గూడెం విక్రంరెడ్డి, గూడెం కుటుంబ సభ్యులు, పరమేష్ యాదవ్, భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

రాయదుర్గం: బీజేపీ ఆధ్వర్యంలో రాయదుర్గంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మూల అనిల్‌గౌడ్, వరలక్ష్మీ, ధీరజ్, శివాసింగ్, కృష్ణ, స్వామిగౌడ్, నరేందర్‌గౌడ్, నరేందర్‌ముదిరాజ్, సురేందర్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: ప్రజల్లో జాతీయభావం పెంపొందించేందుకే హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించామని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని గాంధీ పార్క్ నుండి జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా గోదావరి మాట్లాడుతూ... ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో ర్యాలీ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగసాని నరేష్, పట్టణ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం

చందానగర్ : వికలాంగుల, చేయూత పెన్షన్‌దారుల సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ పేర్కొన్నారు. చందానగర్ జీహెచ్‌ఎంసీ అంబేడ్కర్ కల్యాణ మండపంలో ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం శేరిలింగంపల్లి ఇంచార్జి ఎస్.గణేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా పెన్షన్ దారులకు ఇచ్చిన హామీని నెరవేర్చ లేదన్నారు. పెన్షన్ మీదనే ఆధారపడి జీవించే పేదల సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులు పెన్షన్ దారులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు ఐత రమేష్ మాదిగ, తెగుళ్ల భాస్కర్ ముదిరాజ్, డప్పు విజయ, పి.రేణుక, దార్గుపల్లి రాణి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న 9 మంది అరెస్ట్

మాదాపూర్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 9 మందిని మాదాపూర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు.13వ తేదీ మాదాపూర్‌లోని పలుప్రాంతాల్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుకున్న (ఏహెచ్‌టియు) యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అప్రమత్తమైంది. పర్వత్‌నగర్ వద్ద ఉన్న బీఎస్ఆర్ సూపర్ లగ్జరీ , లివింగ్ హోటల్‌లో ఆర్గనైజర్ హమేర్‌సింగ్ అలియాస్ హమిద్‌సింగ్‌తో పాటు పలువురు దేశంలోని పలు ప్రాంతాల నుంచి యువతులను కొనుగోలు చేసి లోకాంటో, స్కోక్కా వంటి వెబ్‌సైట్‌లలో ప్రకటనలు చేస్తు కాల్స్, వాట్సాప్ ద్వారా కస్టమర్లను సంప్రదిస్తున్నారు. ఓయో రూమ్‌లతో పాటు పలు హోటళ్ళలో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని బుధవారం అరెస్ట్ చేశారు. అనంతరం వేర్వేరు ప్రాంతాలు (పశ్చిమబెంగాల్, డిల్లీ, ఝార్ఖండ్, హర్యానా, పంజాబ్, ఉజ్బెకిస్తాన్)నుంచి వచ్చిన యువతులను పోలీసులు రక్షించారు. కొంత మంది ఉద్యోగాల పేరుతో యువతులను పిలిపించి వారితో బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి.. వ్యక్తి మృతి

గచ్చిబౌలి: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తోట జగదీష్ ప్రసాద్(38) మాదాపూర్‌లో ప్రైవేట్ కంపెనీలో అడ్మిన్ విభాగంలో పని చేస్తూ బీరంగూడలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 13 తెల్లవారు జామున 2 గంటలకు విధులు ముగించుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. గచ్చిబౌలి స్టేడియం సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.